# సాక్షి
## అన్నమయ్య జిల్లా

గురువారం । 15 । జూన్ । 2023






**మృత్యువే గెలిచింది!**

ఎలుకమందు ప్రభావంతో దెబ్బతిన్న కాలేయానికి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తొమ్మిదో తరగతి పూర్తిచేసిన చిన్నారి సి.కీర్తి మృత్యువుతో పోరాడి ఓడింది. - 4లో



**హత్య కేసులో నిందితుల అరెస్టు**

సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన జంజాల కృష్ణయ్య హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ తెలిపారు. - 4లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.320 | రూ.440 |
| రెండోరకం | రూ.230 | రూ.310 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,120 మెట్రిక్ టన్నులు



**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 300 | -- |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 50.34 కిలోలు

## న్యూస్‌రీల్

### జిల్లాలోని ఐటీఐలలో 58 సీట్లు భర్తీ

**రాజంపేట టౌన్ :** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాల కోసం బుధవారం రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆ ఐటీఐ ప్రిన్సిపాల్, పారిశ్రామిక శిక్షణా కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేట్ ఐటీఐలలో 58 సీట్లు భర్తీ అయినట్లు ఆయన తెలిపారు. మరో పది రోజుల్లో రెండవ విడత కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

**రాయచోటి :** జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ బుధవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

### 19 నుంచి వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

**ఏఎఫ్‌యూ :** కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 19 నుంచి జూలై 3 వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్‌మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్ విభాగాల విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. అలాగే కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, శిల్పం, ఆర్ట్ హిస్టరీ విభాగాలకు పరీక్షలు జరుగుతాయన్నారు.

# ఏపీఈఏపీసెట్‌లో మెరిసిన విద్యార్థులు

- అగ్రికల్చర్‌లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించిన అభిజిత్ సాయి
- ఇంజినీరింగ్‌లో వెంకట యుగేష్‌కు రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు

**రాయచోటి :** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీఈఏపీసెట్ పరీక్ష ఫలితాలలో అన్నమయ్య జిల్లా విద్యార్థులు మంచి ర్యాంకులతో మెరిశారు. బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో రాజంపేటకు చెందిన దుగ్గినేని వెంకట యుగేష్ రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో రాయచోటి పట్టణం కె.రామాపురానికి చెందిన దేరంగుల అభిజిత్‌సాయి రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్‌ను సాధించి తన కలను సాకారం చేసుకున్నాడు.

**అగ్రికల్చర్ జిల్లా టాపర్లు వీరే..**

జిల్లా పరిధిలో అగ్రికల్చర్ విభాగంలో 150వ ర్యాంక్‌ను రాయచోటి మాసాపేటకు చెందిన కోటరెడ్డి సాయి దినేష్, 171వ ర్యాంక్‌ను మదనపల్లె రవీంద్రనగర్‌కు చెందిన పి. చిన్మయి సాధించింది. 221వ ర్యాంక్‌తో వీరబల్లె మండలం గుర్రప్పగారిపల్లెకు చెందిన దుర్గం దీపిక, 235వ ర్యాంక్‌ను రైల్వే కోడూరు తిప్పాయిపల్లెకు చెందిన తన్వీష్ సాధించగా, 265వ ర్యాంక్‌ను గుర్రంకొండ మండలం రేగడపల్లెకు చెందిన కె. మాన్యలక్ష్మి సాధించారు. అలాగే మదనపల్లె ఎస్‌వీ కాలనీకి చెందిన బి. రమ్యలహరి 290వ ర్యాంక్, మదనపల్లె బరిణేపల్లెకు చెందిన దీపిక 301వ ర్యాంక్, కలకడ మండలం కోనకు చెందిన జి. చక్రవర్తి 347వ ర్యాంక్, రాయచోటి పట్టణం కృష్ణానగర్‌కు చెందిన బుసిరెడ్డిగారిపల్లె పద్మశ్రీ 376వ ర్యాంక్‌లతో అన్నమయ్య జిల్లా కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేశారు.

**ఇంజినీరింగ్ జిల్లా టాపర్లు వీరే..**

తంబళ్లపల్లె మండలం బాలకవారిపల్లెకు చెందిన జి. మహేంద్రారెడ్డి 45వ ర్యాంక్, మదనపల్లె ప్రశాంత్ నగర్‌కు చెందిన మద్దిపట్ల సాయి శ్రావణ్ 55వ ర్యాంక్, గాలివీడు మండలం అరవీటివాండ్లపల్లెకు చెందిన వెలిగింటి అజయ్‌కుమార్‌రెడ్డి 167వ ర్యాంక్, రాజంపేట కొత్తపల్లెకు చెందిన పి.మహీంద్రరెడ్డి 332వ ర్యాంక్, రాయచోటి ఎన్‌జీఓ కాలనీకి చెందిన జి.సాయి లక్ష్మి దీక్షిత 561వ ర్యాంక్, కలకడ మండలం సింగన వడ్డెపల్లెకు చెందిన డి.రాజశేఖర్‌రెడ్డి 649వ ర్యాంక్, రాజంపేట పట్టణానికి చెందిన పి.లక్ష్మి నరసింహా నిఖిల్ 743వ ర్యాంక్, గాలివీడు మండలం నూలివీడుకు చెందిన డి. రితీష్ కుమార్‌రెడ్డి 1111వ ర్యాంక్, రాయచోటి మండలం శిబ్యాలకు చెందిన జి. లక్ష్మిప్రసన్న 1173వ ర్యాంక్‌లతో జిల్లాలో అగ్రగామిగా నిలిచారు. ఈ ఫలితాలలో మంచి ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను జిల్లా అధికారులు, వారి కుటుంబ సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.

# ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

**రాయచోటిటౌన్ :** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆరోగ్యంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ అన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక డైట్ కేంద్రంలో రాయచోటి పట్టణంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు, డైట్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మన ఆరోగ్యం మరింత రెట్టింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు విస్తృతంగా కల్పించాలి

- అన్నమయ్య డ్యాం బాధిత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి
- నీటి రవాణా బిల్లుల చెల్లింపునకు చర్యలు
- గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

**కడప సెవెన్‌రోడ్స్ :** ప్రజలు తమకు పనులు లేవు..పనులు కల్పించండి...అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగే పరిస్థితి తలెత్తకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు విస్తృతంగా కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి వివిధ అంశాలను సమీక్షించారు. ఉపాధి హామీ పథకంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రాజంపేట మండలంలో చాలా మందికి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల తాను ఆ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఉపాధి పనులు కల్పించాలంటూ ప్రజలు కోరారని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధి కింద చేపట్టిన పనుల గురించి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణరెడ్డిని విచారించారు. జిల్లాకు 45 లక్షల పనిదినాలు కేటాయించారని, ఇప్పటిదాక 40,56,000 పనిదినాలు పూర్తి చేశామని చెప్పారు. ఈ నెలాఖరులోపు మిగతా లక్ష్యాలు పూర్తి చేస్తామన్నారు. జలకళ పథకం కింద ఇప్పటికి 750 బోర్లు ఏర్పాటు చేశామని, ఇంకా వేయాల్సి ఉందని డ్వామా పీడీ పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే ఈలోపు వివిధ కారణాల వల్ల జలకళ పథకం ఆగిందని, మళ్లీ టెండర్లు పిలుస్తున్నారని వెల్లడించారు.

జిల్లాకు రూ. 6.50 కోట్లు తాగునీటి రవాణా బిల్లుల చెల్లింపు కోసం వచ్చాయని అన్నమయ్య జిల్లాలో బిల్లులు త్వరగా అప్‌లోడ్ చేయాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. వేసవి సీజన్ వెళ్లి వర్షాలు కురిసేవరకు తాగునీటి సమస్య ఉంటుందని, కనుక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు క్రియాశీలకంగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలను 15వ ఫైనాన్స్ నిధుల నుంచి విడుదల చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ ఏఓ ఖాదర్ బాషాను జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రయార్టీ బిల్డింగ్స్‌కు ఆలస్యం లేకుండా డబ్బులు చెల్లిస్తున్నామని తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు కింద దెబ్బతిన్న గ్రామాల్లో 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. మిగతా పది శాతం పనులను ఒకటిన్నర సంవత్సరం నుంచి జాప్యం చేస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెనగలూరు జెడ్పీటీసీ సుబ్బరాయుడు, సంబేపల్లె జెడ్పీటీసీ కవిత పలు సమస్యలు ప్రస్తావించారు.

### జర్నలిస్టు హెల్త్ స్కీం పథకానికి దరఖాస్తు చేసుకోండి

**– జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్**

**రాయచోటి :** జిల్లాలో కొత్తగా అక్రిడిటేషన్ కార్డును పొందిన వర్కింగ్ జర్నలిస్టులు వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా అక్రిడిటేషన్ కార్డును పొందిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం కింద ప్రీమియం రూ.1,250 www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలన్నారు. 2024 మార్చి 31 వరకు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. Head of Acco unt: 834200120010300101 DDO Code: 27030802003 పద్దుకింద ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ ఛలానా, గతంలో జారీ చేసిన హెల్త్ కార్డు జిరాక్స్, ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీలను రాయచోటి కలెక్టరేట్ వెనుక ఉన్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వ వాటా రూ.1,250గా ఉన్నందున తప్పనిసరి వివరాలు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అందించాలని కలెక్టర్ సూచించారు.

## క్లుప్తంగా

### జ్యూస్ అనుకుని పురుగుల మందు తాగిన బాలుడు



తండ్రితో చిన్నారి

కురబలకోట : జ్యూస్ అనుకుని రెండేళ్ల బాలుడు ఇంట్లోని పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ సంఘటన బుధవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఎగువబోయపల్లెకు చెందిన కిరణ్ పెద్దకుమారుడు చాణుక్య (2) ఇంటిలో ఆడుకుంటూ జ్యూస్ అనుకుని పొరపాటున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



పఠాన్ ఖలీద్ మృతదేహం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటకు చెందిన పఠాన్ ఖలీద్(34) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు మండలంలోని పఠాన్ ఖలీద్ బేల్దారీ పని చేసేవాడు. బుధవారం గ్రామంలోని సయ్యద్ ఖాన్ ఇంటి నిర్మాణం పనుల కోసం వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా నాలుగు సంవత్సరాల క్రితం ఇంటిపైన విద్యుత్ వైర్‌కు కట్టిన కడ్డీకి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మృత్యువే గెలిచింది!

- చికిత్సపొందుతూ కన్నుమూసిన చిన్నారి కీర్తి
- పదేళ్ల క్రితం నాన్న మృతి, ఉపాధి కోసం కువైట్‌లో తల్లి
- కాలేయం ఇచ్చేందుకు బెంగళూరుకు వచ్చిన తల్లి
- చిన్నారి వైద్యం కోసం రూ.3.22 లక్షల సొంత డబ్బు చెల్లించిన ఎంపీ మిథున్‌రెడ్డి



కీర్తి (ఫైల్)



కీర్తి ఆరోగ్య పరిస్థితిని తల్లి అరుణకు వివరిస్తున్న వైద్యులు

బి.కొత్తకోట : ఎలుకమందు ప్రభావంతో దెబ్బతిన్న కాలేయానికి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తొమ్మిదో తరగతి పూర్తిచేసిన చిన్నారి సి.కీర్తి మృత్యువుతో పోరాడి ఓడింది. కీర్తి ఆరోగ్య సమస్యను రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నాలు చేశారు. బెంగళూరు ఆస్పత్రిలో చేర్పించి కాలేయ మార్పిడికి అవసరమైన నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈలోగా బుధవారం సాయంత్రం బ్రెయిన్‌డెడ్ అయినట్టు బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఈ హృదయ విదారక ఉదంతం వివరాలు... బి.కొత్తకోట మండలం బీరంగికి చెందిన అరుణ, శ్రీనాథ్ దంపతులకు కీర్తి, దీప్తి, తరుణ్ సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. పదేళ్ల క్రితం శ్రీనాథ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం అరుణపై పడింది. పిల్లలను చదివించుకొంటూ వారి ఆలనాపాలనా చూసుకుంటోంది. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారం కావడంతో అరుణ ఉపాధి కోసం ఏడాది క్రితం కువైట్ వెళ్లింది. ముగ్గురు పిల్లలను బీరంగిలో అత్త రమణమ్మ ఇంటిలో వదిలి వెళ్లింది. కీర్తి కురబలకోట మండలం ముదివేడు కేజీబీవీలో 9వ తరగతి చదివింది. ఈ ఏడాది పదవ తరగతి చదవాల్సింది. సెలవుల వల్ల బీరంగిలో ఉంటున్న కీర్తికి గతనెలలో జ్వరంగా ఉండటంతో బి.కొత్తకోటలో ఆస్పత్రుల్లో వైద్యం అందించారు. స్థానిక వైద్యుల సూచన మేరకు మదనపల్లెలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. కాలేయం దెబ్బతిన్నట్టు గుర్తించి చికిత్స చేశారు. 24 సార్లు రక్త మార్పిడి చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా ప్రతినిధి రామిగాని శంకర్ ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎంపీ సోమవారం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రముఖ ఆస్పత్రికి తరలించి సొంత డబ్బు రూ.లక్ష చెల్లించారు. దెబ్బతిన్న కాలేయం మార్పిడి కోసం సీఎం సహాయ నిధి కింద రూ.30 లక్షలు మంజూరు చేయించేందుకు సీఎంఓకు నివేదించారు. ఈ నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటుండగానే ఆరోగ్య పరిస్థితి విషమించి బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కీర్తి అవయాలపై పరీక్షలు నిర్వహించగా ఎలుకల మందు ప్రభావం చూపిందని గుర్తించారు. దీనివల్లే కీర్తి కాలేయంతోపాటు ఇతరా అవయవాలు దెబ్బతిన్నట్టు గుర్తించి ఇదే విషయాన్ని వైద్యులు తల్లికి వివరించారు. ఈ విషయమై తల్లి అరుణ బి.కొత్తకోట పోలీసులకు బెంగళూరు ఆస్పత్రి నుంచి ఫిర్యాదు పంపారు. గతనెల 29న ఆరోగ్యం బాగలేదని ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. బెంగళూరు ఆస్పత్రి వైద్యులు కీర్తి శరీరంలో ఎలుకల మందు ఉందని చెప్పారని, కడుపునొప్పి వల్లే ఎలుకల మందు తినుంటుందని తల్లి అరుణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.

**బిడ్డ కోసం వచ్చిన తల్లి**

బిడ్డ కీర్తిని బతికిందుకునేందుకు కువైట్‌లోని తల్లి అరుణ బుధవారం బెంగళూరు చేరుకుంది. ఐసీయూలో చికిత్సపొందుతున్న కుమార్తెను చూసి విలపించింది. నా బిడ్డను బతికించండి అంటూ డాక్టర్లను వేడుకుంది. కుమార్తెకు తన కాలేయం ఇచ్చేందుకు సిద్ధపడింది. ఈలోగా కీర్తి బ్రెయిన్‌డెడ్ అయినట్టు అరుణకు చెప్పడంతో బోరున విలపించింది.

**రూ.3.22 లక్షలు భరించిన ఎంపీ**

కీర్తిని బెంగళూరు ఆస్పత్రిలో చేర్పించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి రూ.లక్ష చెల్లించారు. ఆస్పత్రి బిల్లు రూ.3,22,661 ఎంపీ సొంత డబ్బు చెల్లించారు. కీర్తి వైద్యం అందించడం కోసం టీం ద్వారకనాథరెడ్డి తరపున శంకర్ రామిగాని రూ.53వేలు, ముదివేడు కేజీబీవి తరపున రూ.70,100 అందించారు. కాగా ఆస్పత్రిలో కీర్తిని చూసుకునేందుకు ఎవరూ లేకపోవడంతో టీం ద్వారకనాథరెడ్డి సభ్యుడు లక్ష్మీపతిరెడ్డి బెంగళూరు ఆస్పత్రిలో కీర్తి వద్దే ఉండి వైద్యులతో మాట్లాడటం, చికిత్స వివరాలను ఎంపీకి తెలియజేసేవారు.

# నీట్‌గా రాణించారు

నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)లో జిల్లా విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. శ్రమకు తగిన ఫలితం దక్కిందంటూ వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మదనపల్లె సిటీ/మదనపల్లె

**కార్డియాలజిస్టునవుతా**



నీట్ యూజీ–2023 ఫలితాల్లో మదనపల్లె పట్టణం ఎస్‌బిఐ కాలనీకి చెందిన కంచుకొమ్మల హేమంత్‌కుమార్ అఖిల భారత స్థాయిలో 738 ర్యాంకు సాధించారు. పట్టణానికి చెందిన కె.తుకారాం ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి అంజలి గృహిణి. హేమంతకుమార్ పదో తరగతి వరకు అభ్యుదయ పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీ చైతన్య కాలేజీలో చదివారు. నీట్‌లో 720 మార్కులకు 690 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నీట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. కార్డిజిస్టునవుతానని హేమంత్‌కుమార్ తెలిపారు.

హేమంత్‌కుమార్

**వైద్యుడినవుతా..ప్రజలకు సేవచేస్తా**



పాండియన్ వీరయ్యతో సంతోషాన్ని పంచుకుంటున్న తల్లిదండ్రులు

వైద్యవిద్యలో ప్రవేశాలకు సంబంధించి జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్ష నీట్–2023లో మదనపల్లెకు చెందిన విద్యార్థి సి.పాండియన్ వీరయ్య 52వ ర్యాంక్ సాధించాడు. మొత్తం 720 మార్కులకు నిర్వహించిన పరీక్షలో 700 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న సి.పాండియన్ వీరయ్య తొలి ప్రయత్నంలోనే నీట్‌లో జాతీయస్థాయి ర్యాంకు సాధించడం విశేషం. ఇంటర్మీడియట్‌లోనూ 1000 మార్కులకు 982 మార్కులు సాధించాడు. పాండియన్ వీరయ్య తండ్రి అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి మణిమాల గృహిణి. పాండిచ్చేరి జిప్మర్ కళాశాలలో చేరి, వైద్యవిద్యను అభ్యసించి ప్రజలకు సేవ చేయాలన్నదే తన ఆశయమని తెలిపాడు.

# హత్య కేసులో నిందితుల అరెస్టు

పులివెందుల : వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన జంజాల కృష్ణయ్య హత్య కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ కాకర్ల ఉత్తమారెడ్డి, కాకర్ల గౌతమి, కాకర్ల కమలమ్మలను అరెస్టు చేశామన్నారు. అంకాలమ్మ గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణయ్య కొడుకు జంజాల అరవింద్ బొగ్గుల బట్టీ పెట్టారని.. దీనినుంచి వచ్చే పొగ వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, బొగ్గుల బట్టీని అక్కడ నుంచి తీసివేయాలని కాకర్ల ఉత్తమారెడ్డి భార్య కాకర్ల గౌతమి కృష్ణయ్య, అరవింద్‌లకు చెప్పింది. అయినా బొగ్గుల బట్టీ తీయకపోవడంతో గౌతమి కృష్ణయ్య, అరవింద్‌లను తరుచూ తిడుతుండేదని.. అది భరించలేక కృష్ణయ్య, అరవింద్‌లు కాకర్ల గౌతమిని చెప్పుతో కొట్టి గాయపరిచారన్నారు. అప్పట్లో వీరిపై కేసు కూడా నమోదైందన్నారు. దీనిని అవమానంగా భావించి కాకర్ల ఉత్తమారెడ్డి, కాకర్ల గౌతమి, కాకర్ల కమలమ్మలు జంజాల కృష్ణయ్య, అరవింద్‌ల ఇంటిపైన దాడి చేశారు. దీనిపైన కూడా అప్పట్లో కేసు నమోదైందన్నారు. నెలరోజుల క్రితం కృష్ణయ్య అనారోగ్య కారణాలతో గ్రామంలోకి వస్తానని చెప్పగా.. గ్రామ పెద్దలు ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి కృష్ణయ్యను గ్రామంలోకి రానిచ్చారన్నారు. గతంలో జరిగిన సంఘటనను జీర్ణించుకోలేకపోయారు. మంగళవారం కృష్ణయ్య టీ తాగడానికి ఒంటరిగా వెళ్లడాన్ని గమనించి ఇంట్లో నుంచి కాకర్ల ఉత్తమారెడ్డి, గౌతమి, కమలమ్మలు కర్రలతో అతనిపై దాడి చేయడంత గాయపడిన కృష్ణయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.

### ఆటో బోల్తా ఆరుగురికి గాయాలు

మదనపల్లె : కుక్కలు అడ్డురావడంతో ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన సంఘటన బుధవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటరమణాచారి (65), వెంకటరమణమ్మ (60), పావని (22), సుకన్య (32), నారాయణస్వామి (70)లు అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ సురేష్ (23) ఆటోలో బోయకొండకు బయలుదేరారు. మార్గమధ్యలో బండ్లపై గ్రామం సమీపంలో వీరు వెళుతున్న ఆటోకు అడ్డుగా కుక్కలు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడిన బాధితులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# యువ రైతు బలయ్యాక మేల్కొన్న ఎక్సైజ్‌శాఖ



సతీష్‌కుమార్ రెడ్డి (ఫైల్)



మట్లివారిపల్లె గ్రామంలో సారా స్థావరాలపై దాడి చేస్తున్న అధికారులు

కురబలకోట : కురబలకోట మండలం వనమరెడ్డిగారిపల్లెకు చెందిన యువ రైతు సతీష్‌కుమార్ రెడ్డి (24) మంగళవారం సాయంత్రం అనుమాస్పద స్థితిలో మృతి చెందారు. తొలుత ట్రాక్టర్ ప్రమాదంలో ఇతను మృతి చెందాడని భావించారు. అయితే అంతకు ముందు ఇతను స్థానికంగా లభ్యమయ్యే నాటా సారా తాగినట్లు చెబుతున్నారు. ఇది తాగిన కొంత సేపటి తర్వాత ట్రాక్టర్‌కు డీజిల్ పోసి ట్రాక్టర్ నడుపడానికి యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఇతన్ని ఇంటికి తరలించారు. అనంతరం నురగ కక్కుతూ స్పృహ కోల్పోయాడని చెబుతున్నారు. వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. నాటుసారా వల్ల ఇతనికి ఏమైనా అయిందా అన్న అనుమానాలు కొత్తగా వ్యక్తమవుతున్నాయి. ఇతనికి వివాహం కాలేదు. బుధవారం మృత దేహానికి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. శరీర భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఇతని మృతికి కారణం ఏమిటన్నది ఈ పరీక్షలలో తెలిస్తుందనిపోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఇతను చనిపోయాక ఆగ్రామంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు మేల్కొన్నారు. బుధవారం పరిసర ప్రాంతాల్లో సారా స్థావరాలు, బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా ఊటను ధ్వంసం చేసారు. ఇదేదో ముందుగానే నిర్వహించి ఉంటే ఓ ప్రాణాం బయటపడి ఉండేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సతీష్ కుమార్ రెడ్డి మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ కేశప్ప, రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు వెల్లడించారు.



### పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



కలికిరి : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలకు చెందిన జే.భద్రయ్య(40) గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పురుగు మందు తాగి ఇంటి ముందు వాంతి చేసుకుంటుండగా గమనించిన భార్య పద్మావతమ్మ గ్రామస్తుల సహాయంతో కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రఫీ కేసు నమోదు చేశారు.

### కేశాలు దానం చేసిన చిన్నారులు





కేశాలు దానం చేస్తున్న అర్షా అంజూమ్

మదనపల్లె సిటీ : కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టినటహెయిర్ డొనేషన్ కార్యక్రమానికి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం 22వ వార్డు కౌన్సిలర్ ముబీన్ కుమార్తె అర్షా అంజూమ్, ఎస్టేట్‌కు చెందిన రేనా, నిమ్మనపల్లెకు చెందిన పావని హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ చిన్నారులకు పూల మొక్కలను అందించి అభినందించారు.

## దాడికి పాల్పడిన ఘటనలో నిందితురాలికి జైలుశిక్ష

సిద్దవటం : మండలం లోని మాధవరం–1 గ్రామనికి చెందిన మల్లూరు సుభద్ర, ఆమె తండ్రి సుబ్బయ్యలను దూషించి దాడికి పాల్పడిన ఘటనలో మల్లూరి మహేశ్వరికి వారం రోజులు జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ బుధవారం సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకళ్యాణ్ తీర్పు ఇచ్చారు. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మల్లూరు సుభద్ర ఇంట్లో మల్లూరు మహేశ్వరి, ఆమె భర్త బాలాజీలు ఉండేవారు. వారిని ఇంటినుంచి వెళ్లిపొమ్మని సుభద్ర, ఆమె తండ్రి సుబ్బయ్యలు చెప్పారు. దీంతో వారిపై మహేశ్వరి, బాలాజీలు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు సిద్దవటం పోలీసుస్టేషన్‌లో 15 డిసెంబర్ 2020న ఫిర్యాదు చేయడంతో అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసులో వాదోప వాదాలు జరిగి, పూర్వపరాలు విన్న జూనియర్ సివిల్ జడ్జి ఏ1గా ఉన్న మహేశ్వరికి వారం రోజుల పాటు జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును ఏపీపీ తాజుద్దీన్ వాదించారని ఎస్ఐ తెలిపారు.

## యువతి ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో ఈ నెల 6న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే యువతి బద్రిపల్లె సురేఖ(23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పోలీసులు బుధవారం ముగ్గురిని అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాలతో వీరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పల్లవోలు గ్రామానికి చెందిన సురేఖ మూడేళ్లుగా గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన దోనాది క్రాంతి కుమార్ ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వివాహం చేసుకుందామని క్రాంతి కుమార్‌ను సురేఖ కోరడంతో ఒప్పుకోలేదు. చచ్చిపో అని బెదిరించగా, వారి కుటుంబీకులతో మాట్లాడి వివాహం జరిపించాలని సురేఖ ప్రాధేయపడగా కులం పేరుతో దూషించారు. దీంతో మనస్థాపం చెందిన సురేఖ లేఖ రాసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి మరణానికి కారణమైన క్రాంతి కుమార్, అతని తల్లి శ్యామల, చిన్నమ్మ విశాలి లను అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు. ఇదే కేసులో క్రాంతి కుమార్ అత్త కూతురు చరితను అరెస్ట్ చేయాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు.

# జగనన్న ఆణిముత్యాలు

- ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉత్తమ అవార్డులు
- 50 మందికి రూ. 7.75లక్షల నగదు పురస్కారాలు

రాయచోటి : విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా రూపుదిద్దుకోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొత్త ఆధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదువుకొని ప్రతిభచాటిన విద్యార్థులకు నగదు రూపంలో ప్రోత్సహకాలు ఇచ్చి సత్కరించాలన్న గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులతో పాటు పాఠశాలకు జ్ఞాపికను అందజేయగా, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను శాలువతో సత్కరించాలని నిర్ణయించారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలు, జూనియర్ కళాశాలలనుంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలకు విస్తృతమైన గుర్తింపు, సత్కార కార్యక్రమాలను రూపొందించి, పదోతరగతిలో 25 మందిని, ఇంటర్మీడియట్‌లో 25 మంది ఆణిముత్యాలను ఎంపిక చేశారు. వీరికి రూ. 7.75 లక్షల నగదును అందజేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జగనన్న ఈ అవార్డులు 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను గుర్తించి అవార్డులను అందజేయనున్నారు.

మొదటి మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు.

**ప్రోత్సహకాలు ఇలా..**


జూన్ 15వ తేదీన నియోజకవర్గ స్థాయిలో ప్రతి నియోజకవర్గంలో పదోతరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులు, ఎంపీసీ,బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ వంటి ప్రతి గ్రూపుల నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరిస్తారు. పదోతరగతి టాపర్‌లకు రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు నగదు పురస్కారం,ప్రతి గ్రూపు నుంచి ఇంటర్మీడియట్ టాపర్‌లకు రూ. 15 వేలు ఉంటుంది.

విద్యార్థులతోపాటు పాఠశాలకు జ్ఞాపికను అందజేయగా, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను శాలువతో సత్కరిస్తారు. అదే కేటగిరిలలో జిల్లాలో పదోతరగతి టాపర్లు జూన్ 17వ తేదీన వరుసగా రూ. 5 వేలు, రూ. 30 వేలు, రూ. 15 వేలు నగదు పురస్కారాన్ని అందుకుంటారు. ఇంటర్మీడియట్ టాపర్లు మే 17న ప్రతి గ్రూపు నుంచి రూ. 50 వేలు చొప్పున అందుకుంటారు. వీరికి జిల్లా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు ఎంపీలు చేతులు మీదుగా వీటిని అందజేయనున్నారు. జూన్ 20వ తేదీన రాష్ట్రస్థాయిలో పదోతరగతి టాపర్లు రూ. 1 లక్ష , రూ. 75 వేలు, రూ. 50 వేలు అందుకోగా ఇంటర్మీడియట్ టాపర్లు ఒక్కొక్కరికి రూ. 1 లక్షలు చొప్పున అందుకుంటారు.

**50 మందికి రూ. 7.75 లక్షలు నగదు పురస్కారాలు..**

అన్నమయ్య జిల్లా పరిధిలో పదోతరగతిలో 25 మందికి ఇంటర్మీడియట్ స్థాయిలో 25 మందికి ప్రోత్సాహకాలను అందించేలా అధికారులు నిర్ణయించారు. వీరికి రూ.7.75 లక్షలు నగదును సత్కార సమయంలో అందజేసేలా జిల్లా విద్యాశాఖఅధికారి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. కోడూరు నియోజకవర్గ పరిధిలో ఆరుగురు పదోతరగతి , నలుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ. 1.45 లక్షలు, మదనపల్లె పరిధిలో పదోతరగతిలో ముగ్గురు, ఇంటర్మీడియట్ నలుగురికు రూ.1.15 లక్షలు, పీలేరు పరిధిలో పదో తరగతిలో ముగ్గురు, ఇంటర్‌లో ఐదుగురికి రూ. 1.30 లక్షలు, రాజంపేట పరిధిలో పదోతరగతిలో 7, ఇంటర్మీడియట్‌లో నలుగురికి రూ. 1.55లక్షలు, రాయచోటి పరిధిలో పదో తరగతిలో ముగ్గురు, ఇంటర్మీడియట్‌లో 4 మందికి రూ. 1.15లక్షలు, తంబళ్లపల్లి పరిధిలో పదోతరగతిలో ముగ్గురు, ఇంటర్‌లో 4 మందికి రూ. 1.15 లక్షలు వంతున ప్రోత్సాహకాలను అందజేయనున్నారు.

**ఏర్పాట్లు పూర్తి ..**



అన్నమయ్య జిల్లా పరిధిలో ఎంపిక చేసిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. నియోజకవర్గాల పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలోని ప్రోత్సాహకాలను అందించాలని ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అందజేశాం. జిల్లా స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించి మరింత మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాం.

– శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి